ప్రజాశక్తి
బుధవారం 23 అక్టోబర్ 2024
I
అల్లూరి సీతారామరాజు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలోని కొరవంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని అల్లూరి జిల్లా ఎస్ ఎఫ్ఐ అధ్యక్షుడు జీవన్ ఆధ్వర్యంలో సోమవారం ఖాళీ కంచాలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ, దసరా సెలవుల నుండి తిరిగి పాఠశాల పున ప్రారంభం నుండి డిప్యూటీ వార్డెన్, ప్రధాన ఉపాధ్యాయుడు విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. సమయపాలన పాటించ లేదని తెలిపారు. విద్యార్థులు బడిలో ఆరోగ్యంగా ఉండాలంటే మంచి భోజనం, మౌలిక సదుపాయాలను ఉండాలన్నారు. చికెన్ ఒక్క రోజు కూడా అమలు కాలేదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి..

గిరిజనులను ఇబ్బంది పెడితే చర్యలు

- కలెక్టర్ దినేష్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:జనన, మరణ దవీకరణ పత్రాలు జారీకి నోటరీ చేయాలని ఇబ్బందులు పెడితే రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు.రెవెన్యూపరంగా జారీ చేసే ధృవపత్రాలకు అఫిడవిట్‌తో పని లేదన్నారు. అఫిడవిట్లు అడిగితే తీవ్రంగా పరిగణించిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని తహశీల్దారులు, మండల సర్వేయర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువ పత్రాలు, ముఖ్యిలకు అఫిడవిట్లకు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన ధృవ పత్రాలు జారీ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందన్నారు. 4110 గ్రామల్లో ని 2.71 లక్షల కుటుంబాలను సర్వే చేయగా 16 వేల మందికి ఆధార్ కార్డులు లేవని, లేనివారికి జారీ చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూముల రీసర్వే చేసే సర్వే నంబర్లను, కచ్చితమైన భూ విస్తీర్ణాన్ని గుర్తించిని నమోదు చేయాలని చెప్పారు. సర్వే ప్రక్రియ చేసేటప్పుడు ముందుగా గ్రామాలకు సమాచారం అందించాలని చెప్పారు. ఇంటింటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భూముల సర్వే సక్రమంగా చేయకపోతే వి.ఆర్.ఓ.లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే నంబర్లను నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు, అసైన్డ్ భూములను పక్కాగా గుర్తించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ చట్టాలను, ప్రభుత్వ జీవోలను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందన్నారు. వెబ్ ల్యాండ్ భూముల వివరాలను నమోదు చేయాలని అన్నారు.జిల్లాలో 86 నీటి సంఘాలు ఉన్నాయని చెప్పారు. నంబరు 21 నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ డి.ఆర్.ఓ. బి.పద్మావతి, పి.యం.యు ప్రోగ్రాం అధికారి రాంగోపాల్ ,తహశీల్దారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ అమలు చేయాలి

- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న భోజన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం స్పష్టం చేశారు. మండలంలోని జైపూర్ జంక్షన్‌లో గల గిరిజన ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాలలో మంగళవారం ఆయన సందర్శించారు. భోజన మెనుతోపాటు తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరు పట్టికతోపాటు రోజు వారి ఉపాధ్యాయుల విధులపై ఆరా తీశారు. అనంతరం తరగతి గదుల్లో వెళ్లి విద్యార్థినిల పఠన సామార్థాన్ని పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి చదువుకు ఆసరగా నివాలని ఆదేశించారు. చాలిచాలని గదులతో ఇబ్బందులు పడుతుండటంపై పరిశీలించిన ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. భోజన మెనులో నిర్లక్ష్యం చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు.విద్యార్థినిల ఉన్నత చదువుకు ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. కొంతమంది విద్యార్థుల తప్పుడు హాజరు నమోదును గ్రహించిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచి శారద, ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, నాయకులు సింహాచలం, కష్ణారావు, నాగేశ్వరరావు, నర్సింగరావు ఉన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల కొరత

- ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు విక్రయం

-సిపిఎం మండల కార్యదర్శి ఐవి

ప్రజాశక్తి -ఎటపాక

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు కొరత ఉందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి ఐవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరో వైపు ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు అమ్ముతున్నారని, ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు రైతు సేవా కేంద్రాల్లో కొనుక్కోమని వ్యాపారులు సలహాలిస్తున్నారని తెలిపారు. స్టాక్ లేదని, ఖాతాదారులకే ఇస్తామని చెబున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు దుకాణాల్లో ఎంఆర్‌పి ధరలకే విక్రయించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎరువుల దుకాణాల వద్ద స్టాక్ బోర్డు, ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు ఎరువులు అందుబాటులో లేకపోవడంతో అధిక ధరలకు కొనుగోలు చేసి రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందుబాటులో ఉంచాలని, ప్రైవేట్ వ్యాపారులు ఎంఆర్‌పి ధరలకే ఎరువులు అమ్మేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి మండల వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రశ్నలు అడుగుతున్న సభ్యులు

మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి-చింతపల్లి : మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. స్థానిక ఎంపీడీవో ఆశాజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపిపి కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో సమస్యలను లేవనెత్తి అధికారుల ను నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ మాట్లాడుతూ, అధికారులు అవృవద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడాన్ని వారు తప్పు బట్టారు.స్థానిక ఆసుపత్రిలోని రోగులను ప్రతి చిన్న రుగ్మతకు మైదాన ప్రాంతానికి రిఫరల్ రాయడం సరైన విధానం కాదని స్థానిక ఎంపీటీసీలు జయలక్ష్మి, ధారలక్ష్మిలు తెలిపారు.బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆశాజ్యోతి ప్రజా ప్రతినిధులు అధికారులకు పరిచయం చేశారు. బదిలీ అయిన ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ఈవోపిఆర్‌డి శ్రీనివాసరావు, ఏవో రవీంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలి

ప్రజశక్తి -హుకుంపేట:- మండల కేంద్రంలోని స్పోర్ట్స్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షానికి కూలిన ప్రహరీ గోడను నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, నాయకులు లింగమూర్తి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వసతి గృహలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు.రక్షణ గోడ ఇప్పటికీ నిర్మించక పోవడం దారుణమన్నారు.బాత్ రూములకు ఎదురుగా ఉన్న గోడ లేకపోవడంతో బాలికలు స్నానాలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వసతి గృహాల్లో ఏదేని సంఘటన జరిగితే అధికారులు హడావుడి చేస్తున్నారే తప్పా ముందుచూపు చర్యలేమి లేదన్నారు. గూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలు ప్రహరి గోడ కూలడంతో వెదురు కర్రలతో తాత్కాలికంగా కట్టారన్నారు.

ఎస్ఐని సత్కరించిన సిఐ

ప్రజాశక్తి - చింతపల్లి: ఉద్యోగులకు బదిలీ అనేది అనివార్యమని సీఐ రమేష్ అన్నారు. స్థానిక ఎస్సై అరుణ్ కిరణ్ పాడేరు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కావడంతో మంగళవారం ఆయనకు సిఐ రమేష్ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను సీఐ, పోలీసులు, పాత్రికేయులు పుష్పగుచ్చాలు అందించి దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు ఎస్సై సేవలను కొనియాడారు. సిఐ రమేష్ మాట్లాడుతూ,ఎక్కడున్నా ప్రజలకు సేవ చేయడమే రక్షక బటులుగా పోలీసుల విధి అన్నారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఎస్సైగా విధులు నిర్వహించిన వెంకటేశ్వరరావు చింతపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి పోలీసులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న సిఐ

గిరిజనులతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

కుంబర్తిలో తాగునీటి సౌకర్యం కల్పించాలి

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధి కుంబర్తి గ్రామానికి జల్ జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని స్థానిక సిపిఎం జడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన శాఖ మహాసభ అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామానికి జలజీవన్ పథకం ద్వారా తాగునీటి సదుపాయం అందిస్తున్నట్లు ప్రకటనలకే పరిమితం అయ్యాయన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు కనీసం తాగునీటి సదుపాయం కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా సరే కుంబర్తి గ్రామం తో పాటు మండలంలోని ఉన్న గ్రామాలకు తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం లుంగపర్తి పంచాయతీ శాఖ కార్యదర్శిగా బడ్నాయిని దేముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య, కార్యకర్త వెంకట్ పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని నుజ్జు అయిన కారు, ఘటనా స్థలంలో జానకమ్మ మృతదేహం

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- మహిళ దుర్మరణం

- ఇద్దరు చిన్నారులకు గాయాలు

ప్రజాశక్తి -సీలేరు

జానకమ్మ (ఫైల్‌ఫొటో)

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు సీలేరు సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. దీనికి సంబంధించి చిత్రకొండ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జికె.వీధి మండలం సప్పర్ల సమీపంలోని ముర్లగెడ్డ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ఏపీ 31 టీవీ 2001 నెంబర్ గల కారులో మంగళవారం ఉదయం ఒడిశా రాష్ట్రం చిత్రకొండ గ్రామానికి వెళ్లారు. తిరిగి ప్రయాణంలో చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధి రాజులకొండ వద్ద కారు అదుపు తప్పి అతివేగంతో చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కిలో జానకమ్మ (35) అక్కడికక్కడే మృతి చెందారు. ఒక పాపకు వెన్నెపూస విరిగిపోగా, మరో పాపకు గాయాలయ్యాయి. డ్రైవర్ పరారులో ఉన్నాడు. మృతదేహాన్ని చిత్రకొండ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. చిత్రకొండ పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా

గాజువాక నుంచి సీలేరు మీదుగా మోతుగూడెం వెళ్తున్న ఓ లారీ మర్రిగూడెం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న బాలదేవ్.

గృహాలకు రూ.5 లక్షలు మంజూరు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్

ప్రజాశక్తి- అరకు లోయ :కేంద్ర ప్రభుత్వం పీవీటీజీలకు మంజూరు చేసిన పీఎం జన్ మన్ ఇల్లులకు రూ.5 లక్షల అంచనా విలువ పెంచాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. అరకువేలి మండలం బొండం పంచాయితీ రేగా గ్రామంలో పీఎం జన్ మన్ ఇల్లు నిర్మాణం చేపడుతున్న ప్రాంతంలో ఆదివాసీ గిరిజన సంఘం బొండం పంచాయితీ నాయకులు కిల్లో బుజ్జిబాబు, డి దిలీప్ కుమార్, కె డొంబు, ఎస్ భీమ, కె గోపాల్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీఎం జన్ మన్ ఇల్లులు పథకం పీవీటీజీ లకు ఒక్కొక్క లబ్ధిదారుడికి 2 లక్షల 39 వేలు అంచన విలువతో మంజూరు చేశారని ఇందులో గ్రామీణా ఉపాధి హామీ క్రింద 39 వేల నిధులతో ఇల్లు పునాది తవ్వడానికి 50 రోజులు ఇతర పనులకు 40 రోజులు మొత్తం 90 రోజుల పనిదినాలకు 39 వేలు మంజూరు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం 2 లక్షలు కలిపి 2 లక్షల 39 వేలు పీఎం జన్ మన్ ఇల్లులు పథకం ద్వారా పీవీటీజీ లకు ఇల్లులు మంజూరు చేశారని తెలిపారు. భవన నిర్మాణా పరికరాలు, సిమ్మెంటు, రాడ్లు, ఇటుకల ధరలు విపరీతంగా పెరిగిందన్నారు. ఉచిత ఇసుక పథకం అమలు కాలేదన్నారు. మండల కేంద్రం నుండి గ్రామాలకు ఇసుక రవాణా చార్జి 10 వేల నుండి 15 వేలు వరకు పెంచారని దీంతో జన్ మన్ ఇల్లులు నిర్మాణం పూర్తి చేయలేని పరిస్థితి నెల కొందన్నారు.ఇల్లు మంజూరైన ప్రతి పీవీటీజీ లాబ్దిదారులకు అడ్వాన్ బిల్లు 70 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎం జన్ మన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలోని ఏపీజీవీబీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్ పలు గ్రామాలలో పిఎం జెజెబి వై పథకం, పలు ప్రత్యేక బ్యాంకు లావాదేవీలపై సోమవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు బ్రాంచ్ మేనేజర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం జన సురక్ష, పీఎం ఎస్‌బి వై, ఏపివై, పిఎంజెజెబి వై పథకం, బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. కించాయిపుట్టు , బరడ గ్రామ పంచాయతీ వివిధ గ్రామాలలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్పి వంతల భగత్ రామ్, ప్రజలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మేనేజర్

రోడ్డుపై రాళ్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని లుంగపర్తి పంచాయతీ నుండి నుండి ఎగుపట్టి, దిగువపట్టి ,చీడివలస, మీదుగా కీవర్ల పంచాయతీ బొంగుజ గ్రామాలకు వెళ్లే రహదారికి అడంగా జెసిబితో తవ్వించి బండ రాళ్లు వేసిన ఇద్దరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక జెడ్పిటిసి గంగరాజు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు గంగరాజు దృష్టికి తీసుకు వెళ్లారు. లుంగపర్తి సచివాలయం .సెల్ టవర్ ఆనుకుని జెసిబితో రోడ్డును అడ్డంగా తవ్వి బండ రాళ్లు వేసి వేశారన్నారు. ఈ కార్యక్రమంలో లుంగపర్తి సర్పంచ్ జన్ని. సన్యాసిరావు, గ్రామస్తులు చంటి, రామన్న, చిన్నయ్య లచ్చన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఎదుట ఐద్వా ధర్నా

జనావాసాల మధ్య షాపును తొలగించాలని డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి రేఖపల్లి గ్రామంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని కోరుతూ భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన మంగళవారం మహిళలు మద్యం దుకాణం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ మాట్లాడుతూ రేఖపల్లి గ్రామంలో ఒక వైపు ప్రభుత్వ వైద్యాలయం, ఒక వైపు క్రైస్తవ ప్రార్థనా మందిరం, మరో వైపు సాయిబాబు ఆలయం ఉన్నాయని, ఇటువంటి ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారని, చుట్టుపక్కల నివాస గృహాలు ఉన్నాయని, వారంతా ఈ మద్యం దుకాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వైసిపి పెద్దల సహకారంతో ఈ మద్యం దుకాణాన్ని ప్రారంభించారని, అధికారులకు, పోలీసులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపును తక్షణమే అక్కడ నుండి తొలగించి ఊరు శివారు ప్రాంతంలో పెట్టుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున మహిళలను కూడగట్టి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు సరస్వతికి అందజేశారు. దీనికి స్పందించి తహశీల్దారు మద్యం దుకాణాన్ని అక్కడ నుండి తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పూనం సరోజిని, రేపు గంగాభవాని, ముత్యాల గాయత్రి, రేపు సావిత్రి, వడ్డానపు లక్ష్మి, ముంజపు వెంకటరమణ, ముత్యాల వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేఖపల్లిలో మద్యం దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

చట్టి ప్రధాన రహదారిపై మద్యం దుకాణం వద్దు

చింతూరు : మండలంలోని చట్టి గ్రామం ప్రధాన రహదారిపై మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ ఆ గ్రామస్తులు మంగళవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. ప్రమాదాలకు నిలయంగా మారుతుందన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేసే ప్రాంతం చుట్టూ అధిక మొత్తంలో జనావాసాలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని ఇబ్బందులున్న ఈ ప్రధాన రహదారిపై మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే గ్రామస్తులంతా ఐక్యంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వినతిపత్రం చూపుతున్న చట్టి గ్రామస్తులు

విశాఖ- భద్రాచలం నైట్ సర్వీసు బస్సుల పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు

విశాఖపట్నం నుండి నర్సీపట్నం, సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే రెండు నైట్ సర్వీస్ బస్సులను మంగళవారం ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. గత నెల 8న అర్ధరాత్రి భారీ వర్షాలకు లంకపాకల నుంచి సీలేరు వరకు రహదారిపై కొండచరియలు విరిగిపడడం, పలుచోట్ల రహదారి కోతకు గురి కావడంతో ఆర్టీసీ అధికారులు ఈ మార్గంలో బస్సు సర్వీసులను నిలుపుదల చేసిన విషయం విధితమే. రహదారి క్లియరెన్స్ అనంతరం పాడేరు డిపో చెందిన డొంకరాయి బస్సును, నర్సీపట్నం డిపోకు చెందిన బస్సులను, తరువాత విశాఖ నుండి భద్రాచలం పగటి పూట వెళ్లే బస్సును పునరుద్ధరించారు. నైట్ సర్వీస్ బస్సులను పునరుద్ధరించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు మంగళవారం నైట్ సర్వీస్ బస్సులను పునరుద్ధరిస్తూ రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

ఇర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గోరంట్ల రవి రామ్‌కిరణ్ మంగళవారం రంపచోడవరం మండలం ఇర్లపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇర్లపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో కందుల సాయిబాబు, కంగల అబ్బాయిదొర, ఐ.పోలవరం మాజీ సర్పంచ్ చవలం బాపన్నదొర, గ్రామ కమిటీ అధ్యక్షులు మీరా పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ జొన్న మామిడి వంతెన, రహదారి మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జొన్నమామిడి గ్రామంలో సుమారు 15 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఏదైనా అత్యవసర సమయాల్లోనూ, నిత్యావసరాలకు జొన్న మామిడి నుంచి మెటల్ రోడ్డు గుండా ద్విచక్ర వాహనాలపైనా, కాలినడకన ప్రధాన రహదారి చేరుకొని అక్కడ సీలేరు వచ్చి వెళ్తుంటారు. అయితే సెప్టెంబర్ 8న అర్ధరాత్రి సంభవించిన వర్ష బీభత్సానికి జొన్న మామిడి రహదారి, వంతెన కొట్టుకుపోయాయి. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. వరదలు వచ్చి 40 రోజులైనా ఈ రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు పంచాయతీ సర్పంచ్‌కు మొరపెట్టుకున్నారు. ఆయన చొరవతో ఎట్టకేలకు ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గుత్తేదారుడితో మరమ్మతు పనులు చేపట్టారు. గత మూడు రోజుల నుంచి ఈ పనులు జరుగుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో ఈ పనులు పూర్తికానున్నాయి. రహదారి వంతెన మరమ్మతు పనులు పూర్తయితే జొన్నమామిడి గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు తీరనున్నాయి.

కొట్టుకుపోయిన వంతెన వద్ద మట్టితో ఫీలింగ్ చేసి లెవెల్ చేస్తున్న దృశ్యం

తాగునీటి పథకాలను వేగంగా పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జల్ జీవన్ మిషన్ పథకంలో మంజూరు చేసిన తాగునీటి పథకాలను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. తాగునీటి పథకాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని చెప్పారు. నిర్దేశించిన గడువులోగా పథకాలను పూర్తి చేయాలని స్పష్టం చేసారు. మంగళవారం కలెక్టరేట్ వీసి హాలు నుండి 22 మండలాల గ్రామీణ నీటి సరఫరా విభాగం, డిఆర్‌డిఎ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, నైపుణాభివృద్ధి సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి పథకాలను విధిగా క్లోరినేషన్ చేయాలని సూచించారు. మంచినీటి ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయాలని చెప్పారు. ట్యాంకుల నిర్వహణపై రిజిష్టర్లు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో 44 మొబైల్ ఆధార్ కిట్లు ఉన్నాయని, ఈనెల 25 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాలను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని అన్నారు.మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల అటెండెన్సుపై దృష్టి పెట్టాలని విద్యార్థుల పఠనా సామర్థ్యాలు పెరగాలన్నారు. ఇంటింటికి వెళ్లి స్కిల్ సర్వే నిర్వహించాలని చెప్పారు. రంపచోడవరం, పాడేరు కేంద్రాలలో యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. ప్రధాన మంత్రి జన సురక్ష బీమా, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ ఇ జవహర్ కుమార్, డి. ఆర్. డి. ఎ, పి.డి. వి.మురళి, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి రోహిణి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

బీమా పథకాలను వినియోగించుకోవాలి

పాడేరు : పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం ప్రచార పోస్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకాలపై జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. జీవితంలో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఆ వ్యక్తి కుటుంబానికి భరోసాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు జన సురక్ష బీమా పథకాలను అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ లో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథ కంలో చేరేందుకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాథు నాయుడు, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, నాబార్డ్ డిడియం చక్రధర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వయోజన అక్షరాస్యతా శాతాన్ని పెంచాలి

పాడేరు : జిల్లాలో పెద్ద ఎత్తున వయోజన అక్షరాస్యతా కార్యక్రమాలు నిర్వహించి అక్షరాస్యతా శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం అమలుపై ఆయన కార్యాలయంలో ఐసిడిఎస్, వయోజన విద్య, పంచాయతీ రాజ్, డి.ఆర్.డిఎ విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యావంతులైన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు, స్వయం సహాయ సంఘాలలోని క్లస్టర్ రిసోర్సు పర్సన్లను, సచివాలయం సిబ్బందిని వినియోగించి అక్షరాస్యతా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలలో ప్రతీ రోజు రెండు గంటలు తరగతులు నిర్వహించి వయోజనులకు అక్షరాలు నేర్పించి చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు.

ఎంపిడి ఓలు, వెలుగు ఎంపియంలు ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్షర్యాత పెంపుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉప సంచాలకులు ఎస్. సుబ్రమణ్యం వర్మ, సహాయ సంచాలకులు డి. చిన్ని కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డి.ఆర్.డి.ఎ పి.డి వి.మురళి, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, ఐసిడిఎస్ పి.డి. ఎన్.సూర్యలక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్ పాలొన్నారు..

ఏచూరికి ఘన నివాళి

నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని వనుగుమ్మలో సిఐటియు మండల కార్యదర్శి కొర్రా శంకర్ ఆధ్వర్యంలో సిపిఎం శాఖ మహా సభలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పివిజిలకు పీఎం జన్‌మన్ ఇల్లులకు 6 లక్షల నా ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొర్రా.త్రినాథ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు రోడ్లు, మంచి నీరు, డ్రైనేజీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి పాంగి.భీమరాజు, ఎస్.ధొన్ను, కె.గంగాధర్, విక్రమ్, చండాల్ పాల్గొన్నారు.

కార్యదర్శికి ఘన సన్మానం

బదిలీ కార్యదర్శి సోమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ కొమ్ములు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ గ్రామ సచివాలయంలో కార్యదర్శిగా పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన కార్యదర్శి పాంగి సోమేశ్ కుమార్‌కు స్థానిక సర్పంచ్ పి కొములు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ తో పాటు మండల వైస్ ఎంపీపీ పి.లలిత, వార్డు సభ్యులు సచివాలయం సిబ్బంది కార్యదర్శికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, సచివాలయ కార్యదర్శి సోమేశ్ కుమార్ సంక్షేమ పథకాలను అందించడంలో ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కిల్లో జైరామ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -నక్కపల్లి: గంజాయి కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిఐ కుమారస్వామి తెలిపారు. ఇటీవల 146 కిలోల గంజాయి పట్టుకున్నామని, ఈ కేసులో అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం చీడిపుట్ గ్రామానికి చెందిన ముక్కి చంద్రబాబు, ముంచంగిపుట్టు మండలం దేగలపుట్టు గ్రామానికి చెందిన పాంగి నరేష్‌ను నక్కపల్లి మండలం వేంపాడు జంక్షన్ వద్ద మంగళవారం అందిన సమాచారం మేరకు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వెల్లడించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని లోడగలవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం మధ్యాహ్న భోజనపథకం జిల్లా కోఆర్డినేటర్ జెఎవిఎ శాస్త్రి ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. భోజనాలు ఎలా ఉన్నాయనిఅడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే హెచ్‌ఎంకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు.

అందని బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్

ప్రజాశక్తి- పెదబయలు : .మండల కేంద్రంలో బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరిం చాలని స్థానిక ఉద్యోగులు, వినియోగదారులు కోరుతున్నారు. సోమవారం సాయంత్రం నుండి మంగళవారం సాయంత్రం వరకు బి ఎస్ ఎన్ ఎల్ సిగ్నల్ లేకపోవడంతో ఉద్యోగులు విద్యార్థుల హాజరు నమోదు చేయడానికి వీలు లేకుండా పోయింది. ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య లావాదేవీలు స్తంభించిపోయాయి. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది తక్షణమే స్పందించి సిగ్నల్ పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరోవార్డులో రూ.66.45 లక్షలతో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ,కొమ్మాది కల్యాణమండపం పూర్తిచేసేందుకు రూ.80లక్షలు అవసరమని, ఆ నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఈ నెల 25న భీమిలిలో ఉన్నతాధికారులతో సమీక్షిస్తామన్నారు.కార్యక్రమంలో కోరాడ రాజుబాబు, శాఖరి శ్రీనుబాబు దాసరి శ్రీను పాల్గొన్నారు.

ఎంవివి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు(జివి)ల అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పౌరగ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, వీరిద్దరిపై వందల కోట్లు మనీలాండరింగ్ ఆరోపణలున్నాయన్నారు. ఎంవివి కనస్ట్రక్షన్ అపార్టు మెంట్లను కొనుగోలు చేసి ఇబ్బందులు పాలవ్వొద్దని ప్రజలకు సూచించారు

ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసుల ఆశలు నెరవేర్చాలి

ప్రజాశక్తి- మాధవధార : ఆర్థిక, సామాజిక, ఇతరత్రా అంశాల్లో వెనుకబడి ఉన్న రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను సిఎం చంద్రబాబు నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ మూల వెంకటరావు కోరారు. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో చాలా ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని,వాటిని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు.ఆయా ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.రాష్ట్రానికి పరిశ్రమలు అవసరమే గానీ, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని, తద్వారా వలస నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని వెంకటరావు కోరారు.

అరకు పినారిని సందర్శించిన డిఎఫ్ఓ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంజోడా సిల్క్ ఫారంలోని అరకు పినారిని అటవీ శాఖ పాడేరు డిఎఫ్ఓ పి వెంకట సందీప్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఆయనకు అక్కడి వి.ఎస్ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా పినారిలో సౌకర్యాలను కల్పించి ఉండటంపై తిలకించిన ఆయన ప్రశంసించారు. అనంతరం అక్కడ మొక్కలను ఆయన నాటారు. ఈ కార్యక్రమంలో సబ్ డి ఎఫ్ ఓ కే ఉమామహేశ్వరి, రేంజ్ అధికారి శ్రీనివాసరావు, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

24న టిడిపి మండల సమావేశం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 24న స్థానిక టిడిపి మండల కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు అపార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో సమావేశం నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇంచార్జ్ ఎస్ దొన్నుదొర హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఈనెల 26 నుంచి చేపట్టనున్న పార్టీ సభ్యత్వ నమోదు పై చర్చించడం జరుగుతుందని చెప్పారు. మండల పార్టీ నాయకులు, బూత్ కమిటీ నాయకులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

తహశీల్దార్‌కు ఘన సన్మానం

తహశీల్దార్‌ను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండల తహసీల్దార్‌గా విధులు చేపట్టి బదిలీపై వేరే జిల్లాకు వెళ్తున్న తహసీల్దార్ నాగమ్మను కార్యాలయ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట బదిలీపై వెళ్తున్న ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్, ఆర్ఐ హరి, విఆర్వోలు ఘనంగా సన్మానించారు. విధుల పట్ల అంకితభావంతోనే గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు. గిరిజన ప్రాంతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి

వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తుడు

ప్రజాశక్తి - చింతపల్లి : సిల్క్ ఫారం నుంచి స్థానిక పెద్దపైపు వరకు ఉన్న 140 మీటర్ల రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని చింతపల్లి గ్రామానికి చెందిన యువకుడు సుర్ల వీరేంద్ర కుమార్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతిలకు రహదారి సమస్య పరిష్కారానికై ఆయన వినతిపత్రం సమర్పించారు.

దారకొండ-గుమ్మరేవుల రహదారి నిర్మించేదెప్పుడు ?

భారీ వర్షాలకు మాదిగమల్లు వద్ద కొట్టుకుపోయిన రోడ్డు
పునరుద్ధరణ కాని ఆర్టీసీ బస్సు
ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పలు గ్రామాల ప్రజలు

కొట్టుకుపోయిన మాదిగ మల్లు రహదారి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి దారకొండ నుంచి గుమ్మరేవుల వరకు శాశ్వత రహదారి నిర్మించి, బస్సును పునరుద్ధరించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సెప్టెంబర్ 8న అర్ధరాత్రి వర్ష బీభత్సానికి దారకొండ నుంచి గుమ్మిరేవులు వెళ్లే రహదారి మాదిగ మల్లు వద్ద పూర్తిస్థాయిలో కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి, వైద్య సేవలు పొందడానికి కూడా మార్గం లేక మారుమూల గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు చోడురాయి గ్రామ సమీపంలో రహదారి, వంతెనకు ఇరువైపులా మట్టితో లెవెల్ చేసి ద్విచక్ర వాహనాలు, చిన్న చిన్న వాహనాలు వెళ్లేందుకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. అయితే మాదిగమల్లు వంతెన దిగు భాగంలో రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో వంతెన పక్క నుంచి డైవర్షన్ రోడ్డు మట్టితో ఏర్పాటు చేశారు. అయితే భారీ వర్షాలు కురిస్తే ఈ మార్గంలో ప్రయాణం నరకయాతనంగా తయారవుతోంది. రహదారి బురదమయంగా మారి వాహనాలు బురదలో కూరుకుపోయే పరిస్థితి దాపరించింది.

పునరుద్ధరణ కాని ఆర్టీసీ బస్సు

మాదగమల్లు వద్ద రహదారి, వంతెన శాశ్వత నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో గుమ్మిరేవుల వచ్చే ఆర్టీసీ బస్ సర్వీస్‌ను పునరుద్ధరించలేదు. దీంతో గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, పాఠశాలల ఉపాధ్యాయులు విధులకు హాజరు కావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వైద్యం సేవలు, నిత్యావసరాలు వంటి పనులకు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఏ పిఒ అభిషేక్, ఆయా శాఖ అధికారులు స్పందించి దారకొండ నుంచి గుమ్మరేవుల వరకు శాశ్వతంగా రహదారి నిర్మించాలని, గుమ్మరేవుల బస్ సర్వీసును పునర్ధరించాలని పలువురు కోరుతున్నారు.

తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ మట్టి రోడ్డు

'ఉక్కు' ఉద్యోగుల కుదింపు కుట్రలను ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విఆర్ఎస్ సర్వే పేరుతో విశాఖ ఉక్కు కార్మికులు, అధికారుల తగ్గింపు కుట్రలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డిపార్టుమెంట్ పాలసీలు, నిబంధనల విభాగం డిజిఎం ద్వారా మంగళవారం 10/24 సర్క్యులర్‌ను విడుదల చేయించిందని, స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్లు, పర్మినెంట్ కార్మికులు ఎంప్లాయి పోర్టల్ సపోర్ట్ సిస్టం (ఇపిఎస్ఎస్)లో విఆర్ఎస్ కోసం తమ సన్నద్ధతను ఈ నెల 29లోపు తెలియజేయాలని దానిలో పేర్కొన్నారని జగ్గునాయుడు తెలిపారు. ప్లాంట్‌లో కనీసం 15 సంవత్సరాల సర్వీసు, 45 సంవత్సరాల వయసు నిబంధనను ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారన్నారు. ఉన్న ఉద్యోగులను కుదించే కుట్ర తప్ప ఇది మరొకటి కాదని మండిపడ్డారు. ఒకవైపు స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి బాట పట్టిస్తామని, నవంబర్ నుంచి రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను నడిపించే పనులు ప్రారంభిస్తామని ప్రకటనలు చేస్తూ.. ఇంకోవైపు ప్లాంట్‌ను నడపడానికి కావలసిన ఆఫీసర్లను, పర్మినెంట్ కార్మికులను తగ్గించడానికి పూనుకోవడం ప్లాంట్‌ను కష్టాల్లోకి నెట్టడమే అవుతుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ లాభాల బాట పట్టాలంటే పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాల్సి ఉందన్నారు. దీనికి కనీసం 19 వేల మంది ఆఫీసర్లు, పర్మినెంట్ కార్మికులు అవసరంకాగా నేడు 12,700 మంది మాత్రమే ఉన్నారన్నారు. వీరిని కూడా విఆర్ఎస్ పేరుతో తగ్గించడం అంటే ప్లాంటును పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడవనివ్వకుండా చేసి నష్టాల్లోకి నెట్టడమే అవుతుందన్నారు. ఉద్యోగుల తగ్గింపు ప్రక్రియను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కాలం పూర్తయిన కాంట్రాక్టులను రెన్యువల్ చేయకుండా సుమారు 900 మంది కాంటాక్ట్ కార్మికులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నేడు గేటు బయట పెట్టిందన్నారు. ఆ కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెన్యువల్ చేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు విషయమై రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం చెబుతున్న దానికీ, ఆచరణలో కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న దానికీ పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు తక్షణమే ఉద్యోగుల తగ్గింపు ప్రక్రియను నిలిపివేయుటకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం, సొంత గనులు కేటాయించడం, స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్రంతో ప్రకటన చేయించడం, సంస్థను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు చర్యలు చేపట్టడం అత్యంత అవశ్యమన్నారు.

కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న పెంటయ్య తదితరులు

కొమరం భీమ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-కూనవరం

ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుడు కొమురం భీమ్ జయంతి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని రేగులపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కొమరం భీమ్ చిత్ర పటానికి వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ కొమరం భీమ్ జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగన పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆదివాసీ యువతీ యువకులు కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న భూమి, నీరు, అడవి సహజ సంపద, ఏజెన్సీలోని వంద శాతం ఉద్యోగాలు వంటి హక్కుల రక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు, వార్డు మెంబర్ బొగ్గా సుబ్బమ్మ, మండల కమిటీ సభ్యులు బొగ్గా సుబ్బయ్య, గ్రామ శాఖ కార్యదర్శి గుండం బాబురావు, శాఖ సభ్యులు బొగ్గా బుచ్చిరాజు, తిమ్మ నాగిరెడ్డి, గుండం శ్రీను, గుండం బుచ్చమ్మ, బొగ్గా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని దేవారం పంచాయతీ పరిధి పోతవరం గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో కొమరం భీమ్ చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆదివాసీ నాయకులు పూలామాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.పండు రెడ్డి, ఉపాధ్యాయుడు కొమరం రామకృష్ణ దొర, ఎస్ఎంసి చైర్మన్ కొమరం వెంకటేశ్వర్లు దొర, మాజీ ఎస్ఎంసి చైర్మన్ తుర్రం రమేష్ దొర, ఆదివాసి జేఏసీ నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొమరం భీమ్ 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆదివాసి హక్కుల కోసం అసఫ్ జాహి నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడు కొమురం భీమ్ అని తెలిపారు. ఆయన అడివిని జీవనోపాధిగా చేసుకొని నిజాం నవాబుల అధికారాలను తోసిపుచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్, చరిత్ర విభాగాధిపతి బి.శ్రీనివాసరావు మాట్లాడారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో కొమరం భీమ్ సొసైటీ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చీఫ్ ప్రమోటర్ కిల్లో మనోజ్ మాట్లాడుతూ స్వయంపాలన ఆదివాసీల జన్మహక్కు అనే నినాదంతో నాటి నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొమరం భీమ్ సాయుధ పోరాటం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు కే.ఆనంద్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా కొత్త పనుల మంజూరు

ప్రజాశక్తి-దేవీపట్నం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొత్తగా మూడు రకాల పనులు మంజూరు చేస్తున్నట్లు ఎంపిడిఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటి వద్ద వాడకం నీరు ఇంటి బయటకు రోడ్ల మీదకు వెళ్లకుండా ఆ ఇంటి ఆవరణలోనే ఇంకిపోవుటకు ఇంకుడు గుంటలు పనులు మంజూరు చేస్తున్నట్లు, దీనికి 6వేల రూపాయలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పశువులకు గడ్డి పెంపకం పనినికి అర ఎకరానికి గడ్డి పెంపకం పనిని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో పల్లె వనాలు అనే పేరుతో పార్క్ ఏర్పాటు చేయడానికి మంజూరు ఇస్తున్నారు. ఈ పల్లె వనాలలో 100కి పైబడి మొక్కలు, నాలుగు బెంచీలు, బౌండరీ మొత్తం బయోఫెన్సింగ్ చేయాల్సి ఉంటుందని ఎంపీడీవో తెలిపారు

గుమ్మరేవుల పంచాయతీలో కొనసాగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమం

తెగుళ్ల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పంటలకు తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అధికారి మధుసూదనరావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేష్ బాబు పంటలపై గిరి రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు తెగుళ్లు వచ్చేటప్పుడు వాటి నివారణ చర్యలు ఏ విధంగా చేపట్టాలో తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. సర్పంచ్ కమలమ్మ మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన సలహాలు రైతులు సూచనలు సలహాలు తప్పక పాటిస్తూ పంటలు అధిక దిగుబడిలో వచ్చేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు సద్విని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరి రైతులు పాల్గొన్నారు.

టిడిఆర్ బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తణుకు మున్సిపల్ కమిషనర్ ద్వారా 2021-22లో రోడ్ల విస్తరణలో స్థలాలు కోల్పోయిన కొంతమంది భూ యజమానులకు జారీ చేసిన టిడిఆర్, ప్రభుత్వం ద్వారా ఏర్పడిన సమస్యల మూలంగా రాష్ట్ర వ్యాప్తంగా బిల్డర్లు చేపట్టిన 1800 ప్రాజెక్టులు ఆగిపోయాయని, దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని ఎపి టిడిఆర్ బిల్డర్ల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున తణుకు టిడిఆర్‌లను అప్పటి అధికారులు తణుకు మున్సిపల్ కమిషనర్ ద్వారా 2021-22లో కొంతమంది భూ యజమానులకు జారీ చేశారని, ఏదైనా జారీకి అనుసరించే ప్రామాణిక సాధారణ విధానం ప్రకారం అవి జారీ చేయబడ్డాయని తెలిపారు. బిల్డర్లు పైన పేర్కొన్న బాండ్లను ప్రభుత్వ పోర్టల్ నుంచి అధికారికంగా కొనుగోలు చేశారన్నారు. వాటిని తమ ప్రాజెక్టులలో వినియోగం కోసం లింక్ చేశామన్నారు. అయితే టిడిఆర్ బాండ్ల జారీలో ఉల్లంఘనలు, మోసం జరిగినట్లు పేర్కొంటూ గత ప్రభుత్వం బాండ్లను 2022 ఫిబ్రవరిలో బ్లాక్ చేసిందన్నారు. ఈ బాండ్ల జారీలో తణుకు మున్సిపల్ కమిషనర్ అవకతవకలకు పాల్పడ్డారని, ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వం విచారణలో పేర్కొందన్నారు. టిడిఆర్ బాండ్ల యజమానులు కూడా తమ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదన్నారు. దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీంతో పాటు బిల్డర్లకు న్యాయం చేయాలని గత ప్రభుత్వంపై కేసులు పెట్టామన్నారు. తదనంతర పరిణామాలను ఆయన వివరించారు.

27 నుంచి బహు భాషా నృత్యాలపై శిక్షణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలోని బాల నృత్య కళాకారులను ప్రోత్సహిస్తూ ఈ నెల 27 నుంచి 2 నెలల పాటు బహు భాషా నృత్యాల్లో ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్.జానకి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విశాఖ జిల్లాకు చెందిన బాలలు ఈ నెల 26లోపు 8522990123 నెంబరులో సంప్రదించి, ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

25న ది గాడ్ ఫాదర్ సినిమా ప్రదర్శన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వారాంతపు ఉచిత సినిమా - ఉత్తమ ప్రపంచ సినిమా ప్రదర్శనలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటలకు విశాఖ పౌర గ్రంథాలయం హాల్‌లో ది గాడ్ ఫాదర్ ఇంగ్లీష్ చిత్ర ప్రదర్శన ఉంటుందని ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ది.గాడ్ ఫాదర్ చిత్రం 1972లో ఆస్కార్ అవార్డు పొందిందని గుర్తుచేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.